రైతుల రెక్క విరిచేస్తోంది..!





మెంటాడలో రెల్ల రాల్చు పురుగు ఆశించిన వరి (ఇన్‌సెట్‌లో) రెల్ల రాల్చు పురుగు

- కోత సమయంలో వరి పంటను ఆశిస్తున్న రెల్లరాల్చు(కంకి) పురుగు
- ధాన్యం కంకులను కొరికేస్తున్న పురుగు
- పొలాల్లో రాలిపోతున్న ధాన్యం
- వందల ఎకరాల్లో పంటకు నష్టం

బొండపల్లి: ఈఏడాది ఖరీఫ్ వరి సాగు చేసిన రైతులకు కలిసి రాలేదు. నారు పోసిన నాటి నుంచి నాట్లు వేసి కోత చేసే వరకు రైతులను ఏదో ఒక సమస్య వెంటాడుతునే ఉంది. సీజన్ ప్రారంభంలో తగిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో నాట్లు వేయడం ఆలస్యమైంది. కొంతమంది రైతులు ముదిరిన నారుతోనే ఉభాలు చేశారు. వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు సకాలంలో నాట్లు వేయగలిగినప్పటికీ ఆతర్వాత వాతావరణ మార్పులతో పంటను తెగుళ్లు ఆశించాయి. ప్రారంభంలో ఆకుముడత, పొడ, సుడిదోమ వంటి తెగుళ్లు పంటను పట్టి పీడించగా, కంకులు ఏర్పడే దశలో కంకి నల్లి తెగులు సోకింది. వీటి నివారణకు పురుగు మందుల కోసం రైతులు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చింది. పొట్ట దశలో ఉన్నప్పుడు వరుణుడు కరుణించకపోవడంతో పంటకు నీటి తడులు అందించేందుకు ఆయిల్ ఇంజిన్లతో చెరువుల నుంచి నీటిని తోడుకోవాల్సి వచ్చింది. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని సాగు చేసిన పంటను కోతలు ప్రారంభించే సమయానికి వచ్చిన ఫెంగల్ తుఫాన్ రైతులకు కొంత వరకు నష్టం కలిగించింది. పొలాల్లో ఉన్న చేను, కుప్పలు తడిసి పోయి కొన్ని చోట్ల ధాన్యం మొలకలు వచ్చాయి. ఇవన్నీ అలా ఉంచితే ఇప్పుడు రెల్ల రాల్చు (కంకి) పురుగు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కోత దశకు చేరిన పంటతో పాటు, కోతలు చేసి పొలంలో ఆరబెట్టిన వరి పనలపై కూడా ఈ పురుగు ప్రభావం చూపిస్తోంది. వరి కంకులను పురుగు కొరికేస్తుండడంతో 20 శాతానికి పైగా ధాన్యం పొలాల్లోనే రాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజపతినగరం సబ్ డివిజన్ పరిధిలోని గజపతినగరం, బొండపల్లి, దత్తిరాజేరు, మెంటాడ మండలాల్లోని నాలుగు మండలాల్లో ఇంత వరకు 6వేల హెక్టార్లల్లో వరి కోతలు పూర్తికాగా, ఇంకా 8 వేల హెక్టార్లలో కోతలు చేయాల్సి ఉంది. రెల్ల రాల్చుపురుగు ప్రభావంతో వందల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లుతోంది. ఈ పురుగు పగలంతా వరిచేను మొదళ్లలో దాక్కొని సాయంత్రం చీకటి పడిన తర్వాత కంకుల మీదకు వచ్చి వరి రెక్కలను కత్తిరించేస్తుంది. దీని వల్ల ధాన్యం కంకులు పొలంలో రాలిపోతున్నాయి. రైతులు అప్రమత్తమై నివారణ చర్యలు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

గజపతినగరం సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్ వరి సాగు వివరాలు	
మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
గజపతినగరం	4,350
బొండపల్లి	3,500
దత్తిరాజేరు	3,800
మెంటాడ	3,250



పురుగు కొరికేయడంతో నెలరాలిన వరి కంకులు



మెంటాడ మండలం ఇప్పలవలసలో పురుగు కొరికేసిన చేనును చూపిస్తున్న రైతులు

నివారణ చర్యలు చేపట్టాలి



రెల్ల రాల్చు పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఈ పురుగు ప్రధానంగా రాత్రి పూట వరి కంకుల పైకి చేరి రెక్కలను కొరికేస్తుంటుంది. నివారణకు క్లోరిపైరిఫాస్ మందును లీటర్ నీటికి 2.5 మిల్లి లీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.ఎరపద్ధతిలో 5 కిలోల తవుడులో మరిగించిన అరకిలో బెల్లం నీటిని కలిపి చిన్న, చిన్న ఉండలుగా చేసుకుని పొలం గట్లు, పొలంలో చల్లుకోవాలి. పంటను పురుగు ఆశిస్తే తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పురుగును గమ నించి రైతులు ఆలస్యం చేయకుండా మందులు పిచికారీ చేసుకోవాలి.

– కె.మహరాజన్, గజపతినగరం సబ్ డివిజన్ ఏడీఏ

పంట నేలపాలు...



ఆరుగాలం కష్టపడి, వేల రూపాయలు పెట్టుబడి పెట్టి రెండు ఎకరాల్లో వరి పంటసాగు చేశాం. పంట చేతికి వచ్చిన సమయంలో రెల్ల రాల్చు పురుగు వరి కంకులను కొరికేస్తుండడంతో పంట నేలపాలవుతోంది. రాత్రికి రాత్రి కంకులను పూర్తిగా కొరికి నేలమట్టం చేస్తోంది.

– తాళ్లపూడి అప్పలనాయుడు, రైతు అంబటివలస, బొండపల్లి మండలం

తీవ్ర నష్టం



మొన్నటి వరకు తెగుళ్లు, తాజాగా ఫెంగల్ తుఫాన్‌తో పాటు రెల్ల రాల్చు పురుగు ప్రభావం వల్ల తీవ్ర నష్టం వాటిల్లింది. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది పెట్టుబడి 20 శాతం పెరిగింది. ఏదోలా కష్టపడి పంటను సాగు చేయగా... కోత సమయంలో ఇలా తుఫాన్, రెల్ల రాల్చు పురుగు వల్ల జరిగిన నష్టంతో పెట్టుబడి కూడా చేతికి వచ్చేలా కనిపించడం లేదు.

– బోడసింగి జగ్గునాయుడు, రైతు, బోడసింగిపేట,బొండపల్లి మండలం

క్లుప్తంగా

8న మాలల గర్జన



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

శృంగవరపుకోట: మాలమహానాడు నేతృత్వంలో విశాఖపట్నంలో ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న మాలల గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు నాయకులు కోరారు. మాలల గర్జనకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ధర్మవరం గ్రామంలోని కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా నాయకులు డోల కేశవ, బండ అప్పన్న, దేబారికి అప్పారావు, గుర్రపు శ్రీను, ఆనంద్, భరత్, సన్యాసయ్య మాట్లాడుతూ మాలల హక్కుల పరిరక్షణ రాజ్యాధికారం, సాధికారత కోసం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మాల సోదరులంతా లక్షలాదిగా గర్జన సభకు తరలిరావాలని కోరారు.

సంఘాల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ బంగారమ్మ

చీపురుపల్లిరూరల్(గరివిడి): డ్వాక్రా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా వెలుగు సిబ్బంది పని చేయాలని వెలుగు గరివిడి క్లస్టర్ ఏరియా కో-ఆర్డినేటర్ బి.బంగారమ్మ అన్నారు. గరివిడి మండల సమాఖ్య ఆధ్వర్యంలో విజన్ బిల్డింగ్ పేరిట వెలుగు సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి డ్వాక్రా సంఘం నుంచి ఇద్దరు యాక్టివ్ ప్రతినిధులు టీఓటీలుగా వ్యవహరించి సంఘాల్లో సభ్యులకు ఆరోగ్యం, పరిశుభ్రత, తాగునీరు, తదితర అంశాలపై అవగాహన కల్పించాలని, సభ్యులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని చెప్పారు. ఏపీఓ పి.నారాయణరావు, టీఓటీ ఏపీఎంలు అరుణ, పద్మ, ఉమా మహేష్,"మండల సమాఖ్య ప్రతినిధులు, సీసీలు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థినులు

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే చిత్రపటాలకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా 9వ తరగతి విద్యార్థినులు ప్రదర్శించిన రామయాణం లఘునాటిక ఆకట్టుకుంది.

లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు



గాజుల అలంకరణలో లక్ష్మీదేవి అమ్మవారు

బొండపల్లి: మార్గశిరమాసం సందర్భంగా అంబటివలసలోని రామాలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి అర్చకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని గాజులు, వివిధ పుష్పాలతో అలంకరించారు. గ్రామస్తులతో పాటు రోళ్లవాక,అయ్యన్న అగ్రహారం తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సమయపాలన పాటించాలి



సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఎంపీపీ సత్యవంతుడు,ఎంపీడీఓ

వేపాడ: గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు సక్రమంగా సేవలందించాలని ఎంపీపీ సత్యవంతుడు, ఎంపీడీఓ సూర్యనారాయణ సూచించారు. మండలంలోని కుమ్మపల్లి గ్రామసచివాలయాన్ని గురువారం వారు సందర్శించారు. గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేలపై, ప్రజల సమస్యలపై సిబ్బందిని ఎంపీపీ ఆరా తీశారు. సర్పంచ్ నౌడు అరుణ,శ్రీను దంపతులు, పీఆర్ ఏఈ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

8న వక్తృత్వ పోటీలు

చీపురుపల్లి: గీతా జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని గీతామందిరంలో ఈనెల 8న విద్యార్థులకు శ్రీమద్భగవద్గీతపై వక్తృత్వ, శ్లోకపఠన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలల విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి, కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్నం 3 గంటల నుంచి పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 94401 05299, 79819 24253 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న ప్రదర్శన



అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 7వ తేదీన మెగా పేరెంట్స్ డే సమావేశాలను విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సమావేశాలకు తల్లి దండ్రులంతా హాజరై విజయవంతం చేయాలని గజపతినగరం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు గురువారం వినూత్న రీతిలో ఆహ్వానం పలికారు.హెచ్‌ఎం చిప్పాడ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినులంతా వలయాకారం, మధ్యలో నంబర్ 7 ఆకారం వచ్చేలా కూర్చొని చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.

– గజపతినగరం

ఉపాధ్యాయుల నిరసన



అన్నమయ్య జిల్లా రాయచోటిలోని కొత్తపల్లి హైస్కూల్‌లో పనిచేస్తున్న మ్యాథ్స్ టీచర్ మహమ్మద్ ఏజియాస్ తరగతిగదిలో బుధవారం అనుమాన స్పద స్థితిలో మృతి చెందారు. ఉపాధ్యాయుడి మృతికి గల కారణంపై అధికారులు, ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదని ఆరోపిస్తూ ప్యాప్టో ఆధ్వర్యంలో గరివిడి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయులు గురువారం నిరసన తెలిపారు. ప్యాప్టో నాయకులు డి.రాము, ఎం.రఘునాథ్, ఏ.సత్యశ్రీనివాస్, మీసాల వెంకటరమణ, బి.రాము, మీసాల రవికుమార్, కె.గోపాలకృష్ణ, సూరి శ్రీను మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఏజియాస్ మరణించి 24గంటలు గడిచినా ఎలాంటి ప్రకటన చేయకపోవడాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం ఉదాసీన వైఖరితో ఉన్నట్లు భావిస్తున్నామన్నారు. అనంతరం ఎంఈఓకు మెమొరాండం అందజేశారు.

– చీపురుపల్లిరూరల్(గరివిడి)

వేతన వెతలు



దత్తిరాజేరు మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు ఆరు నెలలుగా వేతనాలు అందకపోవ డంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారు. తమ బకాయి వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీ యూ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి ఆధ్వర్యంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు.పెండింగ్ వేతనాలతో పాటు తమ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపీడీఓను కోరారు.

– దత్తిరాజేరు

మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారం



కొత్తవలస: మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు అవగాహన కల్పిస్తున్న జడ్జి విజయచంద్ర

కొత్తవలస: వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం మంచి విధానమని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి డాక్టర్ ఎస్.విజయచంద్ర అన్నారు. ఏపీ లీగల్ అథారిటీ ఆదేశాల మేరకు స్థానిక కోర్టు హాల్‌లో మధ్యవర్తిత్వం అంశంపై న్యాయవాదులకు గురువారం అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ గ్రామాల్లో చిన్నచిన్న వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమమని సూచించారు. ఈవిధానం వల్ల కేసులు తగ్గుతాయని తెలిపారు. ముఖ్యంగా న్యాయవాదులే మధ్యవర్తిత్వం వహించాలని, అప్పుడే శాశ్వత పరిష్కారంతో పాటు ఇరువర్గాలకు న్యాయం జరు గుతుందన్నారు. ఈనెల14వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగాలోక్ అదాలత్‌ను న్యాయవాదులు విజయవంతం చేయా లని సూచించారు. న్యాయవాదులు తమ పరిధిలో గల కేసులకు సంబంధించి కక్షిదారులకు అవగాహన కల్పించి వీలైనన్ని ఎక్కువ కేసులను రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. న్యాయవాదులు గొడుగుల మహేంద్ర, దేవి, సీహెచ్. ఆర్.కె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మీడియేషన్ చక్కటి వేదిక



గజపతినగరం: మాట్లాడుతున్న జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: బయటకు చెప్పలేని చాలా వివాదాల పరిష్కారానికి మీడియేషన్ (మధ్యవర్తిత్వం) విధానం చక్కటి వేదిక అని, స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.కనక లక్ష్మి అన్నారు.స్థానిక కోర్టులో న్యాయవాదులకు మీడియేషన్ విధానంపై గురువారం అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ భార్యాభర్తల మధ్య వివాదాలు, ఇతర వివాదాలపరిష్కారం కోసం జిల్లా కోర్టులో ఒక ప్రత్యేక (మీడియేటర్) న్యాయవాదిని నియమించినట్లు తెలిపారు. వివాదాల పరిష్కారానికి ప్రజలు మీడియేటర్‌గా నియమితులైన న్యాయవాదిని సంప్రదించేలా చూడాలని న్యాయవాదులకు సూచించారు. అర్జీదారులకు సహాయకులుగా ఉంటూ వారిసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని న్యాయవాదులకు దిశానిర్దేశం చేశారు.

భవిష్యత్ నాశనం చేసుకోవద్దు



భూదేవిపేట గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

గజపతినగరం: విద్యార్థులు, యువత మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిసగా మారి భవిష్యత్‌ను నాశ నం చేసుకోవద్దని గజపతినగరం ఎస్‌ఐ కె.లక్ష్మణరావు సూచించారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై మండలంలోని భూదేవి పేట గ్రామస్తులకు గురువారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది యువకులు గంజాయి, గుట్కా, మద్యానికి అలవాటు పడి ఆరోగ్యాన్ని, జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. పిల్లల ప్రవర్తన, వారు ఏం చేస్తున్నారన్నది నిత్యం గమనిస్తుండాలని తల్లిదండ్రులకు సూచించారు. పేకాట, కోడిపందేలు, క్రికెట్ బెట్టింగ్‌లు వంటివాటికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతాల నంబర్‌లు, ఏటీఎం పిన్ నంబర్లు చెప్పవద్దని సూచించారు.

అధిక వినియోగంతో అనర్థం



రైతులకు భూసార పరీక్షల కార్డులను అందజేస్తున్న అధికారులు

గజపతినగరం: అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం అన్ని విధాలా అనర్థమని భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు భానులత అన్నారు. ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో వ్యవసాయ ఆధ్వర్యంలో రైతులకు గురువారం అవగాహన కల్పించారు. అతిథిగా హాజరైన భానులత మాట్లాడుతూ నేలలో ఉండే పోషకాల ఆధారంగా పంటలు పండుతాయని అన్నారు.సహజ సిద్ధంగా పండే పంటలను ఆహారం గా తీసుకుంటే మనం ఆరోగ్యంగా ఉంటామని, అందుకే నేలను ఆరోగ్యవంతంగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఎరువులు, పురుగు మందులను పరిమితికి మించి వినియోగించడం వల్ల భూమిసారం కోల్పోతుందని, సేంద్రియ ఎరువులను వినియోగిం చాలని సూచించారు. అనంతరం రైతులకు భూసార పరీక్షల కార్డులను అందజేశారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ గోవిందమ్మ, మండల ఏఓ సీహెచ్.ధనలక్ష్మి, సర్పంచ్ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు సన్మానం



మహిళా రైతును సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థినులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లవైస్ ప్రిన్సిపాల్ మరడాన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ నేల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా రైతులను సన్మానించారు. అనంతరం విద్యార్థులకు ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్, వృక్షశాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ డి.ఎస్.మాధవరావు వివిధ రకా ల నేలలు, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. డబ్ల్యూఈసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ విజయదుర్గ, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్లు, అధ్యాపకులు శ్రీనివాసరావు, భానుప్రసాద్, శాంతిప్రియ, షర్మిళారాణి తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసంతో అధిక పాల ఉత్పత్తి



పాడి రైతులకు గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్న జేడీ రమణ, తహసీల్దార్ అరుణకుమారి

శృంగవరపుకోట: పాడిపశువుల్లో పాల ఉత్పత్తి సామర్థ్యం పెరగాలంటే మేలైన పచ్చిగడ్డిని మేతగా వేయాలని జిల్లా పశుసంవ ర్ధకశాఖ సంయుక్త సంచాలకులు(జేడీ) రమణ పాడిరైతులకు సూచించారు. మండలంలోని సన్యాసయ్యపాలెం గ్రామంలో ఏఎఫ్‌పీఆర్‌ఓ సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు పశుగ్రాసం పెంపకం, పశు పోషణపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జేడీ మాట్లాడుతూ పాడి పశువులకు పచ్చిమేత అందించడం వల్ల పాలదిగుబడులు పెరుగుతాయన్నారు. పశువుల్లో సంతాన ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుందన్నారు. పశుగ్రాసం పెంచేందుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. తహసీల్దార్ అరుణకుమారి మాట్లాడుతూ రైతులు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా పాడి పరిశ్రమను ఎంపిక చేసుకోవాలన్నారు. గ్రామాల్లో శుక్రవారం నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం 50 మంది పాడి రైతులకు ఉచితంగాగడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. పశుసంవర్ధకశాఖ ఏడీ చలపతిరావు, ఏఎఫ్‌పీఆర్‌ఓ ప్రాజెక్ట్ మేనేజర్ చుక్క శ్రీరాములు, పశువైద్యాధికారి హేమ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సాగునీటి సంఘాల ఎన్నికలు

మెరకముడిదాం: మండలంలోని 15 సాగునీటి చెరువులకు సంబంధించిన సంఘాల ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నారు. మండల రెవెన్యూ అధికారులు ఇప్పటికే ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి, సచివాలయాల వద్ద ప్రదర్శించారు. సాగునీటి సంఘాలు ఉన్న చెరువుల ఇవే...పిన్నచెరువు (మెరకముడిదాం), రేగిడిచెరువు (సోమలింగాపురం), గొడ్డుతామర చెరువు(గర్భాం), ఆనందసాగరం(భైరీపురం), సీతగెడ్డ ఆనకట్ట, లక్ష్మునాయుడుచెరువు (ఇప్పలవలస), పూతికవలస ఆనకట్ట, తంటాల పూను ఆనకట్ట, గరుగుబిల్లి ఆనకట్ట (గరుగుబిల్లి), రామసాగరం (బిల్లలవలస), మార్కొండపట్నాయకుని చెరువు (కొర్లాం), మండపువాని చెరువు, సదాశివుని చెరువు, కోమటిచెరువు, బద్దివాని చెరువు (ఉత్తరావల్లి).

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంట్యాడ: రామవరం విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ పెద్దింటి త్రినాథ్ రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కొఠారుబిల్లి, పెణసాం, చిన్నమానాపురం, బుడతానపల్లి, నీలావతి, జగ్గాపురం, గొర్లెపేట, నరవ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరిశోధనల వ్యాప్తికి పేటెంట్ ప్రచురణలు కీలకం

విజయనగరం అర్బన్: పరిశోధనల ఆవిష్కరణల వ్యాప్తికి పేటెంట్ ప్రచురణలు కీలకంగా నిలుస్తాయని స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఒడిశా డీన్ డాక్టర్ ప్రఫుల్లకుమార్ పాండా, పేటెంట్ అటార్నీ సంప్రతి బసంత్ అన్నారు. స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'పేటెంట్ ప్రచురణ' అంశంపై గురువారం జరిగిన అవగాహన సదస్సుకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేటెంట్స్ ప్రచురణ, హక్కులపై చర్చించారు. పరిశోధన అభివృద్ధికి పేటెంట్లు ఆర్థిక సామర్థ్యాలను ప్రోత్సాహకాలుగా అందిస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ దామోదర నాయుడు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 20 మందికి ఉద్యోగాలు

గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో సూర్య టెక్ సొల్యూషన్స్ సంస్థ గురువారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ ద్వారా 20 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి తెలిపారు. తొలి జామ్, గ్రూప్ డిస్కషన్స్ మరియు ఇంటర్వ్యూ ప్రక్రియలను నిర్వహించి ఎంపిక చేపట్టారని తెలిపారు. వార్షిక ఆదాయం రూ.3 లక్షల వేతనాలతో ఉద్యోగావకాశాలను కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, సూర్య టెక్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధి సతీష్, విశాఖ బ్రాంచ్ ప్రతినిధి హర్ష, డీన్ ప్లేస్‌మెంట్స్ మరియు విభాగాధిపతులు పర్యవేక్షణలో పాల్గొన్నారు.

వైద్య శిబిరం



సేవలందిస్తున్న వైద్యాధికారి పుష్పాంజలి

గజపతినగరం: మండలంలోని కాలంరాజుపేట గ్రామసచివాలయంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు.104 సిబ్బందితో కలిసి శిబిరంలో 53 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం గృహ సందర్శన చేసి శిబిరానికి రాలేకపోయిన వృద్ధులు, బెడ్ రెస్ట్ రోగులకు వైద్యసేవలందించారు.